క్లుప్తంగా

రామకృష్ణాపురంలో కూరగాయల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురంలో ఇమేజ్ లయన్స్ మల్టీ ట్రస్ట్, ఇందిరా మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పేద ప్రజలకు కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ కేవీ రామారావు మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా కూరగాయలు పంపిణీ చేస్తున్నామని అన్నారు. పేద ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఇందిరా మహిళా మండలి అధ్యక్షురాలు కే మాధవీలత మాట్లాడుతూ ట్రస్ట్, మహిళా మండలి సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం 100 మందికి కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు శశిధర్, సభ్యులు మణి, కన్నన్, వాణీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం



మధురానగర్(విజయవాడసెంట్రల్): నెల్లూరు రవీంద్ర భారతి పాఠశాలలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాసం వేడుకలు ఘనంగా జరిగాయి. వేదపండితులు సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యార్థులచేత అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మీనాక్షి శైలజ మాట్లాడుతూ విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని ప్రతి విద్యార్థికీ సరస్వతీ దేవి ఆశీస్సులు లభించాలని తాము సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం పాఠశాల జీఎం శివారెడ్డి, ఏజీఎం కేశవరాజు, ప్రిన్సిపాల్ మీనాక్షి శైలజ విద్యార్థులకు పలక, బలపాలు అందజేసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లితండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులను అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన ప్రణతి బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మంగళవారం సాయంత్రం అమ్మవారికి పంచహారతుల అనంతరం ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై ప్రణతి శిష్యబృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చింది. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు. అమ్మవారిని దర్శించుకుని ఆరుబయటకు విచ్చేసిన భక్తులు చల్లటి గాలులలో చక్కటి నృత్య ప్రదర్శనను వీక్షించి ముగ్ధులయ్యారు.

దాసాంజనేయునికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

భవనంపై నుంచి పడి బాలుడి మృతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భవనంపై నుంచి కింద పడి గాయాలపాలైన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన వన్‌టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే వన్‌టౌన్ పల్లెవీధిలో మహావీర్‌జైన్ కుటుంబం నివాసం ఉంటోంది. ఆయనకు ఒక కుమార్తె, ఒక కుమారుడు సంభవ్‌జైన్ (15) ఉన్నారు. పదో తరగతి చదువుతున్న సంభవ్‌జైన్ సోమవారం ఉదయం పాఠశాలకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. సాయంత్రం ఐదున్నర గంటలకు ఇంటిపై అంతస్తుకు ఆడుకునేందుకు వెళ్లాడు. కొద్ది సేపటికి ఎదురింటి వ్యక్తి బిగ్గరగా అరుస్తూ మహావీర్‌జైన్‌ను పిలిచి మీ అబ్బాయి భవనం పైనుంచి కిందకు పడిపోయాడని చెప్పాడు. దాంతో మహావీర్‌జైన్ కిందకు వచ్చి ఆటోలో తీవ్ర గాయాలతో ఉన్న తన కుమారుడిని సూర్యారావుపేటలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు వేళాయె

- ప్రారంభమైన ఆన్‌లైన్ ప్రక్రియ
- 2 నుంచి 10 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- 4 నుంచి 6 వరకు స్పెషల్ కేటగిరి సర్టిఫికెట్ల పరిశీలన
- జూలై 19న సీట్ల కేటాయింపు
- జూలై 20న తరగతులు ప్రారంభం
- ఉమ్మడి కృష్ణా జిల్లాలో సుమారు 35 వేల డిగ్రీ సీట్లు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉమ్మడి కృష్ణా జిల్లాలో డిగ్రీ కోర్సుల అడ్మిషన్లకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియను ప్రభుత్వమే నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో సుమారు 35 వేల సీట్లకు సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైంది. దీనికి సంబంధించి ప్రభుత్వం సోమవారం రాత్రి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ క్రమంలో కళాశాలలు అడ్మిషన్లకు అధికారికంగా శ్రీకారం చుట్టాయి.

కృష్ణా వర్శిటీ పరిధిలో 130 కళాశాలలు

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోని డిగ్రీ కళాశాలలు కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోకి వస్తాయి. కృష్ణా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా సుమారు 130 కళాశాలలు కొనసాగుతున్నాయి. ఆయా కళాశాలల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీబీఎం, ఐవోటీ తదితర కోర్సుల్లో సుమారు 35 వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా బీఏలో 20 రకాల కాంబినేషన్లు, బీకాంలో 20 కాంబినేషన్లు, బీఎస్సీలో 40 కాంబినేషన్లకు సంబంధించిన కోర్సులను ఆయా కళాశాలలు ఆఫర్ చేస్తున్నాయి. ప్రధానంగా పూర్వ కాలంలో ఉన్న కాంబినేషన్లకే కాకుండా కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, బయోటెక్నాలజీ వంటి రంగాలకు సంబంధించి ప్రస్తుతం డిమాండ్ ఉన్న విభిన్న రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

ఎవరు అర్హులు..?

డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు గుర్తింపు పొందిన బోర్డుల బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన కోర్సుల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్సెస్, కామర్స్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్, సోషల్ వర్క్ వంటి పలు అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాంల్లో ప్రవేశాలు పొందేందుకు వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే ఇంజినీరింగ్, ఫార్మసీ స్ట్రీమ్‌లు మినహా మిగతా కోర్సులకు ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రాంల్లో కూడా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రాసెసింగ్ ఫీజు కింద ఓసీ విద్యార్థులు రూ. 400, బీసీ విద్యార్థులు రూ. 300, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 200 చెల్లించాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్

- ఉన్నత విద్యామండలి చేపట్టిన డిగ్రీ కోర్సుల అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా జిల్లాలోని వివిధ కళాశాలల్లో చేరేందుకు ఈ నెల 2 నుంచి 10వ తేదీ వరకూ విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా తమకు కావాల్సిన కోర్సులను ఎంపిక చేసుకోవచ్చు.
- వెబ్ ఆప్షన్ల ద్వారా రాష్ట్రంలోని వారికి కావాల్సిన వివిధ కళాశాలలను సైతం ఎంపిక చేసుకోవచ్చు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్టేషన్ చేసుకోవాల్సి ఉంటుంది.
- ఈ నెల నాలుగు నుంచి ఆరో తేదీ వరకూ స్పెషల్ కేటగిరి పరిశీలన విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తారు.
- అలాగే ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకూ వెబ్ ఆప్షన్లకు సంబంధించి విద్యాశాఖ పరిశీలన చేయనుంది.
- జూలై 19వ తేదీన వెబ్ ఆప్షన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు ఉన్నత విద్యామండలి సీట్లను కేటాయిస్తుంది.
- జూలై 20 నుంచి 22వ తేదీ వరకూ విద్యార్థులు ఎలాట్‌మెంట్ జరిగిన కళాశాలల్లో రిపోర్ట్ చేయడమే కాకుండా అదేరోజు తరగతులను సైతం ప్రారంభించాలని ఉన్నత విద్యామండలి తన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు

కేంద్రం ప్రవేశ పెట్టిన నూతన విద్యా విధానంలో భాగంగా కృష్ణా విశ్వవిద్యాలయం తన అనుబంధ కళాశాలల్లో గత ఏడాది నుంచి నాలుగేళ్ల డిగ్రీ కోర్సులను ప్రారంభించింది. అందులో భాగంగా బీఏ, బీకాం, బీఎస్సీల్లోని వివిధ కోర్సుల్లో ఆనర్స్‌ను అందిస్తున్నాయి. అందులో విద్యార్థులకు నాలుగేళ్ల పాటు ఆయా కోర్సులను అందిస్తాయి. అలాగే విద్యార్థుల సౌకర్యార్థం మధ్యలో ఆ కోర్సులు చదువుతూ ఆగిపోయినా అప్పటి వరకూ జరిగిన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి వివిధ రకాల సర్టిఫికెట్లను అందించే దిశగా ఆదేశాలు జారీ చేసింది.

ఆదాయ పన్ను చెల్లించడం ఉద్యోగుల బాధ్యత

డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్



ఆదాయ పన్నుపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఆదాయ పన్ను చెల్లించి దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని విజయవాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అన్నారు. ఆదాయ పన్ను శాఖ, విజయవాడ రైల్వే డివిజన్ సంయుక్త ఆధ్వర్యంలో రైల్వే ఆడిటోరియంలో ఆదాయ పన్నుపై ఉద్యోగులు, పెన్షనర్లకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఆర్ఎం మాట్లాడుతూ చాలామంది ఆదాయ పన్ను దాఖలు చేయడంలో ఇతర వ్యక్తులపై ఆధారపడుతున్నారన్నారు. కొద్దిపాటి అవగాహన కలిగి ఉంటే ఇది ఏమాత్రం కష్టతరం కాదన్నారు. ఆదాయ పన్ను నిబంధనలను చదివి వాటిని అర్థం చేసుకుంటే పన్నులను సులభంగా సొంతంగానే ఫైలింగ్ చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు పన్నులు ఫైలింగ్ చేసే క్రమంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. పన్నుల ఎగవేతకు దారితీసే ఎలాంటి తప్పులు లేకుండా చూసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆదాయ పన్ను శాఖ జాయింట్ కమిషనర్ ఎన్.అభినయ మాట్లాడుతూ దేశ ఆదాయంలో ఆదాయ పన్నుల సేకరణ కీలకమైనప్పటికీ సరైన అవగాహనతో సులభ పద్ధతిలో పన్నులు చెల్లించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆదాయ పన్ను నిబంధనలు, పరిజ్ఞానం, పన్ను చట్టాలు, పన్ను తగ్గింపులు, మినహాయింపులు, తప్పుడు క్లెయిమ్స్ తదితర విషయాలపై పూర్తి అవగాహన కల్పించినట్టు చెప్పారు. అనంతరం ఆదాయ పన్ను శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆదాయ పన్ను దాఖలు, పన్ను ప్రయోజనాలు, తగ్గింపులు, రిఫండ్ స్కామ్‌లు, రెడ్ ఫ్లాగ్ తదితర అంశాలపై మార్గనిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం కె.శ్రీనివాస్, సీనియర్ డీఎఫ్ఎం ఈ.శివరామకృష్ణ, సీనియర్ డీపీఓ కట్టా ఆనంద్, సీనియర్ డీఎంఓ రవికుమార్, ఆదాయ పన్ను శాఖ అడిషనల్ కమిషనర్‌లు డి.విజయ్ బాబు, ఆర్.చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న నోబుల్ టీచర్స్ అసోసియేషన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ విజయవాడ నగర శాఖ ఆధ్వర్యంలో మూకల అప్పారావు స్మారక ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హాలులో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పదో తరగతిలో అత్యధిక మార్కులతో ప్రతిభ కనబరచిన 21 మంది విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా బోధన చేసిన 62 మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు, 37 మంది ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరించారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యు.వి సుబ్బారావు కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగానికి మూకల అప్పారావు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు, కోశాధికారి జే శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు శేషగిరి రావు, నగర అధ్యక్షుడు గణపతి రావు, బీవీ సోమసుందరరావు, వీటీఆర్ నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ డ్రైవింగ్ స్కూల్‌ను సందర్శించండి

జిల్లా కలెక్టర్‌ను కోరిన లారీ యజమానుల సంఘం



జిల్లా కలెక్టర్ సృజనను మర్యాద పూర్వకంగా కలిసిన లారీ యజమానుల సంఘ సభ్యులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.సృజనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తేలప్రోలు సమీపంలోని అంపాపురంలో 20 ఎకరాల విస్తీర్ణంలో అన్ని వసతులతో అసోసియేషన్ ఆధ్వర్యంలో 2005లో ఏర్పాటు చేసిన దేశంలోనే అతిపెద్దదైన మోడల్ డ్రైవింగ్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ అండ్ రీసెర్చ్ సెంటర్‌ను సందర్శించాల్సిందిగా కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగమోతు రాజా, ఉపాధ్యక్షుడు కాజ వెంకట సత్య చలపతిరావు, ప్రధాన కార్యదర్శి అల్లాడ వీర వెంకట సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైవీ ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

రేపు మాసశివరాత్రి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో గురువారం శ్రీధర్మ పరిషత్ మహాసంస్థానం ఆధ్వర్యాన మాస శివరాత్రి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామివారికి విశేషంగా అభిషేకాలు అర్చనలు జరుగుతాయని పేర్కొన్నారు. భక్తులు మాస శివరాత్రి పూజల్లో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

పశువులను రోడ్లపైకి వదిలితే చర్యలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర వీధుల్లో ఇష్టానుసారంగా పశువులను రోడ్లపైకి వదిలి వేయడంతో పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రోడ్లపై రాకపోకలకు అవరోధం కలిగించేలా పశువులను వదిలితే చర్యలు తీసుకుంటామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. వీఎంసీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.సోమశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో క్యాటిల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, నగరంలోని వీధుల్లో రోడ్లపై సంచరించే పశువులను సిబ్బంది ద్వారా స్వాధీనం చేసుకుని అజిత్‌సింగ్‌నగర్‌లో ఎక్సెల్ ప్లాంట్ వద్ద ఉన్న క్యాటిల్ షెడ్ (బందుల దొడ్డి)కి తరలిస్తామని పేర్కొన్నారు. ఆయా పశువుల యజమానులు నగరపాలక సంస్థ వారికి తగిన ఆధారాలను చూపి, అపరాధ రుసుం చెల్లించి, అఫిడవిట్ సమర్పించి పశువులను తీసుకుని వారి సొంత స్థలంలో ఉంచుకోవాలని, నిర్దేశించిన గడువు లోపల పశువులను తీసుకువెళ్లకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరిశోధనా రంగాల్లో మహిళల పాత్ర పెరగాలి



మాట్లాడుతున్న ఆచార్య ఉపాసనా బోరా సింహా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పరిశోధనా రంగాల్లో మహిళల భాగస్వామ్యం మరింత పెరగాలని నాగాలాండ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్య ఉపాసనా బోరా సింహా అన్నారు. కేబీఎన్ కళాశాల పీజీ రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎస్టీఈఎం పరిశోధనల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే వ్యూహాలు' అంశంపై సదస్సును మంగళవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన ఆచార్య ఉపాసనా బోరా సింహా మాట్లాడుతూ వివిధ రంగాల్లో పరిశోధనలు చేసేందుకు ముందుకు వస్తున్న మహిళల సంఖ్య చాలా తక్కువగా ఉంటుందన్నారు. ప్రధానంగా విద్యారంగంలో మహిళల సంఖ్య పెరిగినా ఆ మేర పరిశోధనల్లో కనపడటం లేదన్నారు. ఇది సరైనది కాదని అభిప్రాయపడ్డారు. మహిళలు పరిశోధనల్లో పాల్గొనేందుకు, రాణించేందుకు ప్రభుత్వానికి చెందిన వివిధ విభాగాలు అనేక అవకాశాలను కల్పిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా సామాజిక చైతన్యానికి మానవ వికాసానికి సైన్స్ అండ్ టెక్నాలజీ, మ్యాథ్స్, ఇంజినీరింగ్ విభాగాల్లో మరిన్ని ఆవిష్కరణలు రావాల్సిన అవసరాన్ని ఆమె వివరించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడు సమాజానికి మరింత మేలు జరుగుతుందన్నారు. పరిశోధనా రంగాల్లో ఉన్న అవకాశాలను మహిళలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ఆ దిశగా అవగాహనను పెంచుకోవాలని సూచించారు. ఆయా రంగాల్లో ఉన్న ఉపాధి అంశాలను సైతం పరిశీలించాలని కోరారు. కార్యక్రమాన్ని రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జి.కృష్ణవేణి నిర్వహించగా పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యర్థాలు తొలగించిన పారిశుద్ధ్య సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్



చెత్తాచెదారం తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరపాలకసంస్థ అధికారులు స్పందించారు. స్థానిక గద్దె వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీ రోడ్డులోని వ్యర్థాలను మంగళవారం పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఈ రోడ్డులో ఎవరికి వారు చెత్తాచెదారం వేయడం వల్ల డంపింగ్ కేంద్రంగా మారడంతో స్థానికులు పడుతున్న అవస్థలను వివరిస్తూ సాక్షి మంగళవారం 'డంపింగ్ కేంద్రంగా జీవీఆర్, దావు కాలనీ రోడ్డు' శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించి ఏఎంహెచ్ఓ డాక్టర్ రామకోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కమలాకర్, మేస్త్రి శ్రీను నేతృత్వంలో రోడ్డు పక్కన డంప్ చేసిన చెత్తాచెదారం వ్యర్థాలను తొలగించారు. ఆరు వాహనాలను ఏర్పాటు చేసి చెత్తచేదారంను తరలించారు. స్పందించిన అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

కొండెక్కిన కూరగాయలు



పాయకాపురం రైతుబజార్

పాయకాపురం(విజయవాడరూరల్): కూరగాయల ధరలు ఆకాశనంటుతుండటంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేయలేక నానా అవస్థలు పడుతున్నారు. గత కొద్ది రోజులుగా ఇదే పరిస్థితి నెలకొని ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న రైతుబజార్‌ల్లో సైతం కూరగాయల ధరలు బహిరంగ మార్కెట్‌లో మాదిరిగానే అధిక ధరలు పలకడంతో పేద ప్రజలు కూరగాయలు కొనుగోలు చేయలేక రోటిపచ్చలకే పరిమితం అవుతున్నారు. మార్కెటింగ్ శాఖ కంటి తుడుపుగా రెండు రోజులు మాత్రమే మదనపల్లి లాంటి ప్రాంతాల నుంచి టమోటాను తీసుకొచ్చి స్టాల్స్‌లో విక్రయించి చేతులు దులుపుకొంది. ప్రస్తుతం పాయకాపురం రైతుబజార్‌లో కిలో టమోటా ధర 44 రూపాయలు, ఉల్లిపాయలు 40 రూపాయలకు విక్రయిస్తున్నారు. వంకాయలు 28, దొండకాయలు 16, బీరకాయలు 36, గోరు చిక్కుడు 50, పచ్చిమిర్చి 80, కాకర 58, చిక్కుడు 70 రూపాయలు ఉన్నాయి. వంద రూపాయలు తీసుకెళితే కనీసం రెండు రకాల కూరగాయలను కూడా కొనలేని పరిస్థితి. మండిపోతున్న కూరగాయల ధరలతో అల్లాడిపోతున్న సామాన్యులు వాటిని కొనుగోలు చేయలేని పరిస్థితిలో ఉన్నారు. నాణ్యమైన కూరగాయలను బయట వ్యాపారులకు విక్రయిస్తున్న రైతుబజార్‌లోని స్టాల్స్ వారు నాసిరకం కూరగాయాలను ఇక్కడ విక్రయిస్తున్నారనే విమర్శలున్నాయి. ఈ వ్యవహారం అంతా మార్కెటింగ్ శాఖ అధికారుల కనుసన్నల్లో జరుగుతున్నా ఎవ్వరూ ఏమి పట్టించుకోవడం లేదంటున్నారు. అధికారులు వ్యాపారుల నుంచి మామూళ్లు తీసుకుని సైలెంట్‌గా ఉంటున్నారనే ఆరోపణలు లేకపోలేదు. కనీసం కొనుగోలు చేసిన కూరగాయలు తీసుకెళ్లే నిషేధిత ప్లాస్టిక్ కవర్ కూడా 8 రూపాయలు ఒక రకం, 12 రూపాయలు ఒక రకం చొప్పున విక్రయిస్తున్నారు. కూరగాయలు విక్రయించే స్టాల్స్‌ను పర్యవేక్షించాల్సిన ఎస్టేట్ ఆఫీసర్ అందుబాటులో ఉండకపోవడంతో వ్యాపారం చేసే వారు ఇష్టానుసారం విక్రయాలు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. ఎస్టేట్ ఆఫీసర్ స్థానంలో సెక్యూరిటీ గార్డు ఉండటంతో అక్కడకు వెళ్లిన వినియోగదారులకు ఏ సమాచారం ఇవ్వలేకపోతున్నారు.

7న ఎమ్మార్పీఎస్ జన జాతర

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7న జన జాతర సభ నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో–కన్వీనర్ మానికొండ శ్రీధర్ మాదిగ తెలిపారు. గాంధీనగర్ ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మంగళవారం జన జాతర సభ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 7న ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం ఈదుమూడి గ్రామంలో జన జాతర సభ జరుగుతుందన్నారు. సభలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. సభలో భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు వేలాదిగా తరలి వచ్చి జన జాతర సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



గ్రామ సభలో మాట్లాడుతున్న కార్యదర్శి రమణ

నున్న(విజయవాడరూరల్): వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.టి.వి.రమణ సూచించారు. గ్రామ ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. అంటువ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీల్లోని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. గ్రామంలో పలు చోట్ల రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు నిర్మించాల్సి ఉందన్నారు. అయితే నిధులు సౌలభ్యం ఉపాధి గ్రాంటు రావాలన్నారు. ఎస్టీ కాలనీ వాసులకు శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని స్థానికులు వినతి పత్రం అందజేశారు. ఎస్టీ కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు అధ్వానంగా ఉన్నాయని ఆ కాలనీ వాసులు పలువురు గ్రామ సభ దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలో డ్రెయినేజీ కాల్వలు పల్లంగా ఉండటంతో మురుగు పారే పరిస్థితి లేదన్నారు. దీంతో అనేక వ్యాధులు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లు కూడా ధ్వంసమై నడవడానికి వీలు లేకుండా ఉన్నాయని కాలనీ వాసులు తెలిపారు. ఏఎన్ఎం లక్ష్మి డయేరియా లాంటి వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గ్రామ సభలో ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర, పంచాయతీ పాలకవర్గ సభ్యులు కాటూరి శ్రీనివాసరావు, గంపా శ్రీనివాసరావు, ప్రత్తిపాటి సుందరయ్య, యర్కారెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పాయకాపురం(విజయవాడరూరల్): పాత రాజీవ్‌నగర్‌లో వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కుతాడి దుర్గారావు ఆటో డ్రైవర్. అతని కుమారుడు, మేనల్లుడు సోమవారం రాత్రి గొడవ పడుతుండగా వారించేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో అతని బావమరిది యేసుబాబు రాయితో దాడి చేశాడు. ఈ సంఘటనలో దుర్గారావు తలకు గాయం కాగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామివారి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు రాధాకృష్ణ భజన సమాజం(కొయ్యూరు) సహకారంతో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఇంటి పన్ను వివరాలు పారదర్శకంగా ఉండాలి

నున్న(విజయవాడరూరల్): గ్రామాల్లో ఇంటి పన్ను వివరాలను పారదర్శకంగా ఉంచాలని విజయవాడ డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్పీఓ) భమిడి శివమూర్తి అన్నారు. మంగళవారం ఆయన ప్యూరిఫికేషన్ ఆఫ్ హౌస్ ట్యాక్స్ పరిశీలనలో భాగంగా ఇంటి పన్ను వివరాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నున్న గ్రామంలో 4,600 అస్సెస్మెంట్లు ఉన్నాయని, ఆ వివరాలు పోర్టల్‌లో ఉంచాలని సిబ్బందికి చెప్పారు. అధికారులు రికార్డుల పరిశీలనకు వచ్చినప్పుడు తేలిగ్గా వాటిని తెలుసుకునేలా అందుబాటులో ఉంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోర్టల్‌ను నిర్వహిస్తోందన్నారు. ప్రతి 15 రోజులకోసారి మంచినీటి ట్యాంక్‌లను శుభ్రం చేయాలని సూచించారు. ట్యాంకులు శుభ్రం చేసిన తేదీల వివరాలను కూడా ట్యాంక్‌పై రాయాలన్నారు. ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తున్న ఆర్వో వాటర్ ప్లాంట్లలో నీటి పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. మాంసం దుకాణాల వద్ద డాక్టర్లతో జంతువులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించిన పిమ్మట మాంసం విక్రయాలు జరిపించాలని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రజలు డయేరియా, ఇతర వ్యాధుల బారిన పడి అవస్థలు పడుతున్నారని, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజారోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.